విద్యా వ్యవస్థలో ఆజాద్ సేవలు మరువలేనివి

భీమునిపట్నం: దేశంలో విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చాలా గొప్పవని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన జాతీయ విద్య దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆజాద్ సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ పిల్లలను చక్కగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. అనంతరం చాత్రోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు జె.మాధవి, హరిణి పాల్గొన్నారు.

తగరపువలస: భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.



చాత్రోపాధ్యాయురాలికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలోని 'నగరాలు'కు సీఎం జగన్ మహోపకారం

అందరికీ బీసీ 'డీ' గుర్తింపుపై హర్షం

పీఎం పాలెం: రాష్ట్ర వ్యాప్తంగా నివసిస్తున్న నగరాలు సామాజిక వర్గాన్ని బీసీ 'డీ'గా గుర్తిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవో నంబర్ 25 విడుదల చేయడంపై ఆ సామాజికవర్గం నాయకులు, పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం పీఎం పాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన నగరాలు సామాజికవర్గం వారిని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీసీ 'డీ' కేటగిరీలో చేర్చారని గుర్తు చేసుకున్నారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో నివసిస్తున్న వారికి మాత్రమే ఈ నిబంధన వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నివసిస్తున్న నగరాలు సామాజిక వర్గం వారిని బీసీ 'డీ' జాబితాలో చేరుస్తూ జీవో నంబర్ 25 విడుదల చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీఎం పాలెం, మధురవాడ ప్రాంతంలో అధికంగా ఉన్న నగరాలు సంతోషం వ్యక్త చేశారు. స్థానిక కుల పెద్దలు, నాయకులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వాండ్రాసి సన్యాసిరావు, పోతిన యర్రాజీ, వాండ్రాసి రవి, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పోతిన నానాజీ, లోహిత్ పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నగరాలు సామాజిక వర్గం నాయకులు

ఘనంగా అనంతుని శాంతి కల్యాణం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం జరిపారు. తదుపరి పవిత్రాలను విసర్జింపజేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత అనంతుని విగ్రహాలకు వేదపండితులు శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కుంతీ మాధవ స్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్‌ఎంసీలో కృతజ్ఞతార్పణల పండగ

తగరపువలస: చిట్టివలస లండన్ మిషన్ చర్చిలో శనివారం కృతజ్ఞతార్పణల పండగ నిర్వహించారు. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన స్టెల్లా మేరీ పండగ ఆవశ్యకతను వివరించారు. దేవాలయం అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, ఏటా మారుమూల ప్రాంతాల్లో సువార్త ప్రకటించడం కోసం పండగ నిర్వహిస్తున్నామన్నారు. క్రీస్తును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. పాస్టర్ ఎం.సుబ్బారావు జాకబ్, కార్యదర్శి సుంకర కృపారావు, కోశాధికారి ఎస్.విలియమ్స్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్ శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ధన త్రయోదశిని పురస్కరించుకుని శనివారం విశేష అర్చనలు నిర్వహించారు. ముందుగా ధనలక్ష్మి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి 132 నాణాలతో అర్చన నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. అదేవిధంగా సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

పీఎం పాలెం : త్రయోదశి సందర్భంగా ఈ ప్రాంతంలోని శివాలయాల ఆవరణలోని నవగ్రహ మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ శృంగేరీ శంకర మఠంలో త్రయోదశిని పురస్కరించుకుని నవగ్రహాలకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.



అడ్డంగా నిలిపిన వాహనాలకు తాళాలు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలకు ట్రాఫిక్ పోలీసులు ఉపక్రమించారు. నాలుగు రోడ్ల కలయికతో ఏర్పడిన ఆనందపురం జంక్షన్‌లో వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి వేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా మార్కెట్‌కు వచ్చే వారు పార్కింగ్ స్థలం లేక వాహనాలను రోడ్డుపై ఎక్కడిబడితే అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్న వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు తాళాలు వేస్తున్నారు. అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ చర్యలు ఎంత వరకు సత్ఫలితాలు ఇస్తాయో చూడాల్సి ఉంది.



రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనానికి తాళం వేసిన ట్రాఫిక్ పోలీసు

ప్రజా సమస్యల పరిష్కారానికే రక్షణ భేరి

మధురవాడ: కార్మికులు, శ్రామికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఎం విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్ చెప్పారు. మధురవాడ జంక్షన్‌లో ఆ పార్టీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు అమాంతం పెంచుకుంటూ పోతోందన్నారు. విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. మతాలు, తెగలు మధ్య చిచ్చు పెడుతూ అందరినీ మోడీ మోసం చేశారన్నారు. డి.అప్పలరాజు, ఎ.గురుమూర్తి రెడ్డి, సియాద్రి పైడితల్లి, డి.తులసి, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి' విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం : ఏయూ ఇటీవల ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో ఆనందపురం గాయత్రి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ దుక్క అప్పలరాజు తెలిపారు. డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో చిల్ల పద్మావతి 9.33, పి.సుకన్య 9.03, ఎల్.భువన చంద్ర 8.9 గ్రేడ్‌లు సాధించినట్టు వివరించారు. ఈ మేరకు శనివారం ఆయా విద్యార్థులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించేలా తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. కళాశాల డైరెక్టర్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతుల పాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు శనివారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, మజ్జి శంకరరావు, పతివాడ ఇంద్రరావు, పాండ్రంగి సత్యంనాయుడు, రేవిడి సచివాలయ కన్వీనర్ తొగరోతు అబద్దం, ఒమ్మి పైడినాయుడు పాల్గొన్నారు.



ప్రారంభించిన భవనం వద్ద నాయకులు

ముగిసిన ఇస్తమా వేడుకలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీనగర్ జామియా మసీదులో శనివారం ఇస్తమా వేడుకలు ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 వేల మంది ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రదేశాలకు సేవా కార్యక్రమాల నిమిత్తం వారంతా తరలివెళ్లారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా జూనియర్, డిగ్రీ కళాశాలల చైర్మన్ బి.నరసింగరావు శనివారం పలువురు విద్యార్థులకు ఉచితంగా రూ.10 వేల విలువైన పుస్తకాలు పంపిణీ చేశారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతోపాటు నోట్సులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎస్‌సీ అకాడమీతో ఒప్పందం

తగరపువలస: సీఎస్‌సీ అకాడమీతో సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యాజమాన్యం శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అనిట్స్ ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, అకాడమీ లెర్నింగ్ కన్సల్టెంట్ అండ్ కో ఆర్డినేటర్ వై.రామ్మోహన్‌రావు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ, పీజీ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అకాడమీ సీ – డాక్, ఐఈఈఈ ఆర్గనైజింగ్‌లో ఉచితంగా శిక్షణ అందిస్తుందన్నారు. ఈ సదుపాయాన్ని బి.టెక్, ఎం.టెక్ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనిట్స్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీకాంత్, ప్లేస్‌మెంట్ అధికారి జి.మన్మథరావు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో 39 బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్టు అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. తగరపువలస శివారు బంగ్లామెట్ట వద్ద 23, భీమిలిలో 4, ఆనందపురంలో 6, పద్మనాభం, శిర్లపాలెం, రెడ్డిపల్లిలో ఒక్కొక్కటి, రేవిడిలో 3 దుకాణాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు వివరించారు. జీవీఎంసీ భీమిలి జోన్ అధికారులు కూడా బంగ్లామెట్టలోని బాణసంచా దుకాణాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మధురవాడ: బాణసంచా స్టాల్స్ నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఉల్లంఘిస్తే సహించేది లేదని పీఎం పాలెం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వై.రామకృష్ణ, వెంకటరావు సూచించారు. మధురవాడ జోన్ పరిధిలోని ఓజోన్ వ్యాలీ రోడ్డులో ఏర్పాటు చేసిన 24 స్టాల్స్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు శనివారం స్వయంగా పరిశీలించారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.